క్లుప్తంగా

19న గణపయ్యకు లక్ష ఉండ్రాళ్ల నివేదన


ప్రత్యేక అలంకరణలో గణపతిస్వామి

భట్టిప్రోలు: వెల్లటూరులో కొలువైన శ్రీ సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామి దేవాలయంలో ఈ నెల 19న లక్ష ఉండ్రాళ్ల నివేదన మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఆ రోజు స్వామి వారికి అభిషేకాలు, లక్ష ఉండ్రాళ్ల నివేదన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలోని శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ ఆలయంలో ప్రతి మంగళవారం వాహం కాని యువతులకు శ్రీఘ్రంగా వివాహం జరిగేందుకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

గర్భిణులకు, తల్లులకు అవగాహన సదస్సు



జంపని(వేమూరు): ప్రభుత్వం గర్భిణులకు, తల్లులకు పౌష్టికాహారం అందిస్తోందని అంగన్‌వాడీ సూపర్ వైజర్ శాంతిశ్రీ తెలిపారు. చైల్డ్ రైట్స్ అడ్వకసీ పొండేషన్ అధ్వర్యంలో మంగళవారం వేమూరు మండలంలోని వరహాపురం, జంపని, వేమూరు, బలిజేపల్లి, చావలి గ్రామాల్లో బాలల రక్షణ కమిటీ, ఈసీసీడీ తల్లుల కమిటీ సమావేశం నిర్వహించారు. చైల్డ్ రైట్ అడ్వకసీ పొండేషన్ ప్రాజెక్ట్ మేనేజరు ఎస్.శ్రీనివాసరరావు మాట్లాడుతూ శిశువు నుంచి 5ఏళ్లలోపు ఉన్న పిల్లల ఎదుగుదల, మానసిక ప్రవర్తన గురించి వివరించారు. మహిళలు గర్భిణిగా ఉన్నపుడు, ప్రసవానంతరం పాటించే పద్ధతులు గురించి మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కీర్తన, వెంకటేశ్వరమ్మ, సంధాన, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనకు.. శిక్షణ



బాపట్ల అర్బన్: బాపట్ల పట్టణంలోని విస్తరణ శిక్షణ కేంద్రంలో మంగళవారం ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరెడ్డి జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో 2030 డిసెంబరు 31 నాటి సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనలో భాగంగా ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, నెల్లూరు జిల్లాలకు చెందిన 42 మంది మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ, విద్యా సహాయకులు, ఇంజినీరింగ్ సహాయకులు, స్థానిక సంస్థల అధికారులకు రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. కోర్సు మానిటరింగ్ అధికారిగా ఎస్.మధుసూదన్‌రెడ్డి, కన్సల్టెంట్, ఫ్యాకల్టీ సభ్యులు కె.లలిత, కె.శ్రీనివాసరావు, బోధన సిబ్బంది పాల్గొని శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమానికి హాజరైనవారికి ఐక్యరాజ్య సమితిచే ప్రతిపాదించిన 193 దేశాలు ఆమోదించిన 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను తొమ్మిది థీమ్స్‌గా పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రతిపాదించడం జరిగిందన్నారు. పేదరికం లేని గ్రామం, బాల, మహిళ హిత, నీటిసమృద్ధి, సుపరిపాలన గ్రామాలైన థీమ్స్‌కు అనుగుణంగా శిక్షణ ఇచ్చారు.

మృతదేహం బంధువులకు అప్పగింత

రేపల్లె: పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో.. నగరం మండలం గుడ్డికాయలంక గ్రామానికి చెందిన ఉప్పాల సుబ్బారావు అలియాస్ పిచ్చయ్య(50) అనే వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని మంగళవారం ప్రయాణికులు గుర్తించారు. పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ విజయచంద్ర మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి భార్య, పిల్లలను పిలిపించి మాట్లాడారు. మద్యం సేవించడం, అనారోగ్య కారణాల దృష్ట్యా అతను మరణించి ఉండవచ్చని తెలుసుకుని, మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసుపై విచారణ చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

సంక్షేమ సారథికి అండగా ఉందాం

'గడప గడపకు' కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి


బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: నవరత్న పథకాలు ప్రవేశపెట్టి అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరు అండగా నిలవాలని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం బాపట్ల పట్టణం 14వ సచివాలయం పరిధిలోని 21వ వార్డులో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలను వివరించి, కరపత్రాలు అందజేశారు. ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. ఏ కారణంగానైనా అందకపోతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అర్హత ఉంటే ఎవరు సిఫారసు అక్కర్లేదని, దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులు జాబితాలో చేరుస్తామన్నారు. కుల, మత, రాజకీయాలకతీతంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి నీ చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రెసిడెంట్ కోకి రాఘవరెడ్డి, కాగిత సుధీర్ బాబు, వడ్డి ముక్కల డేవిడ్ పిల్లి శేఖర్ కొక్కిలిగడ్డ చెంచయ్య , స్వరాజ్యం గొర్రముచ్చుపుష్ప రాజ్యం, ఇనగాలూరి మాల్యాద్రి, జాల్ రెడ్డి ఆట్ల ప్రసాద్ రెడ్డి, వార్డు ఇన్‌చార్జి పద్మ, కానగంటి లక్ష్మి రాఘవ, మీరాబి, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవ ధాన్యాలతో.. భూమి సారవంతం


ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది


యాజలిలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

కర్లపాలెం: నవ ధాన్యాల సాగుతో భూమి సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయం సహాయకులు గంజి శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం యాజలి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ ఖరీఫ్, రబీ సీజన్‌ల అనంతరం భూసారం పెంచుకునేందుకు నవ రత్నాల గుళికలను భూమిలో చల్లుకోవాలని చెప్పారు. తొలకరి వర్షాలు పడినప్పుడు పైరు ఏపుగా పెరిగి భూ తాపాన్ని తగ్గించటంతో పాటు భూసారం పెరుగుతుందన్నారు. ఇందుకు సాగు చేయాల్సిన 30 రకాలైన పచ్చిరొట్ట పైర్ల గురించి శ్రీకాంత్ రైతులకు వివరించారు. తక్కువ ఖర్చుతో చీడపీడలను అరికట్టటంతో పాటు తెగుళ్ల ఉధృతిని తగ్గించుకోగలుగుతామని చెప్పారు. 15 కిలోల నవ ధాన్యాలను తీసుకుని బీజామృతంతో విత్తనశుద్ధి చేసి వాటిని బంకమట్టి, ఘన జీవామృతం, బూడిదతో నీరు కలిపి గుళికలు తయారు చేసుకోవాలని చెప్పారు. వీటిని ఆరునెల్ల వరకు నిల్వ చేసుకుని.. ఎప్పుడైనా భూమిలో చల్లుకోవచ్చునని రైతులకు సూచించారు. భూమి సారవంతంగా ఉన్నప్పుడే దిగుబడులు ఆశాజనకంగా వస్తాయని శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది సత్యనారాయణ, భూలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

సుస్థిర సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి

పిట్టలవానిపాలెం: సుస్థిర సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని జెడ్బీఎన్ఎఫ్ యాక్టివిస్ట్ వరదానం తెలిపారు. మండలంలోని అల్లూరు గ్రామంలో మంగళవారం సుస్థిర సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఘన జీవామృతంతో విత్తన శుద్ధి చేయడం వల్ల మొక్కల్లో వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు మొలక శాతం పెరుగుతుందని తెలిపారు. బెట్ట పరిస్థితుల్లో కూడా విత్తనం మొలకెత్తుతుందని తెలిపారు. రైతుల సమక్షంలో 30 రకాల విత్తనాలతో సాగు, నేలతల్లి బాగు అనే అంశంపై విత్తన గుళికలు తయారు చేసి, వివరించారు.అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 30 రకాల విత్తనాలతో సాగు చేయడం వల్ల భూసారం పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్బీఎన్ఎఫ్, సిబ్బంది రైతులు ఉన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ


మాత్రలు వేస్తున్న సర్పంచ్ రవి కిరణ్మయి


విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

భట్టిప్రోలు: జాతీయ నులి పురుగుల నివారణ (డీ వార్మింగ్ డే) కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్బెండజోన్ మాత్రలు పంపిణీ చేశారు. భట్టిప్రోలు సర్పంచ్ దారా రవి కిరణ్మయి, సచివాలయం–2 పరిధిలో చిన్నారులకు మాత్రలు అందించారు. జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, సర్పంచులు మాచర్ల కోటేశ్వరరావు(ఐలవరం), మోర్ల విజయలక్ష్మి(సూరేపల్లి) బొల్లెద్దు రాజమ్మ(పల్లెకోన) తదితరులు మాత్రలు అందజేశారు. వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యురాలు చావలి రామలక్ష్మి, టీఎంరావు హైస్కూల్లో హెచ్ఎం సీహెచ్ రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం

రేపల్లె రూరల్: నులి పురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆఫీసర్ సుజాత అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కారుమూరు ప్రాథమిక పాఠశాలలో విలేజ్ హెల్త్ క్లినిక్ ఆధ్వర్యంలో మంగళవారం ఆల్బెండజోల్ మాత్రల విద్యార్థులకు పంపిణీ చేశారు. కడుపులో నులి పురుగులు వృద్ధి చెందితే పిల్లల్లో రక్తహీనత, పోషక లోపం, ఆకలి మందగించటం, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరోచనాలు, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రసాద్, ఏఎన్ఎం లక్ష్మి, ఆశ కార్యకర్తలు వాణిశ్రీ, బాలమణి, రంగవర్ధని, విద్యార్థులు పాల్గొన్నారు.

మాత్రలు పంపిణీ

పెరవలి(వేమూరు): పెరవలి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వెంకట సురేష్ మంగళవారం నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు మాత్రలు వేశారు. అలాగే పీహెచ్‌సీ పరిధిలోని అన్ని పాఠశాలల్లో మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ సత్తార్


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ సత్తార్

రేపల్లె: రైతులకు వ్యవసాయ అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ సత్తార్ అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయశాఖ అధికారులతో సాధారణ సమావేశం నిర్వహించారు. మండలంలో ఈకేవైసీ చేయించుకోని రైతులను గుర్తించి త్వరితగతిన నూరు శాతం లక్ష్యాన్ని సాధించాలన్నారు. డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పరికరాలలో భాగంగా ఐదుగురు సభ్యులను గ్రూపులుగా ఏర్పాటు చేసి, వారికి కావాల్సిన ట్రాక్టర్‌లు, రొటావేటర్‌లు, ఆయిల్ ఇంజన్లు, తైవాన్ స్ప్రేయర్‌లు ఇప్పించాల్సిందిగా సూచించారు. రబీ సీజన్‌కు సంబంధించి పంట నమోదు వివరాలు రైతు భరోసా కేంద్రాల్లో ఉంచి రైతులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విజయ్‌బాబు, ఏఈవోలు ప్రభాకరరావు, ఎ.పావని, వీఏఏలు, ఎంపీఈవోలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి

బాపట్ల: మహానేత డాక్టరు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని బాపట్ల పట్టణ నడిబొడ్డున ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి కోరారు. చీలురోడ్డు సెంటర్‌లో మహా నేత డాక్టరు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అధికారులకు వినతి పత్రాలు ఇచ్చామని తెలిపారు. తన నివాసంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్యాలయం వద్ద రాజశేఖర్‌రెడ్డి విగ్రహం, పట్టణంలో రూ.146 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల శిలా ఫలకాలను తొలగించటం సరికాదని గాదె మండిపడ్డారు. జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టరు శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశామని చెప్పారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లం గోపీకృష్ణ, గిరిజారాణి, చింతల రాజశేఖర్, దేగల రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.15లక్షల టోకరా

రేపల్లె రూరల్: రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తామని ఓ యువకుడి నుంచి లక్షల రూపాయలు వసూలు చేసిన ఇద్దరిలో.. ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ విజయచంద్ర తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. రేపల్లె మండలం కారుమూరు గ్రామానికి చెందిన యర్రమోతు శివదుర్గా ప్రసాద్‌కు రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి 2021 అక్టోబర్ 16న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన పంజర్ల సీతారాం, గొలుసూరి వీరకుమార్ రూ.15లక్షలు వసూలు చేశారని చెప్పారు. అప్పటి నుంచి వారు శివదుర్గా ప్రసాద్‌ను మభ్యపెడుతూ మాటలు దాటవేశారన్నారు. చివరికి తాను మోసపోయానని గ్రహించిన శివదుర్గాప్రసాద్ పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. విచారణలో భాగంగా నిందితులలో ఒకరైన పంజర్ల సీతారాంను హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నామని, రేపల్లె కోర్టులో హాజరుపరిచామని చెప్పారు. మరో నిందితుడు వీరకుమార్ పరారీలో ఉన్నాడన్నారు. ఎవరైనా అపరిచత వ్యక్తులు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెబితే నమ్మొద్దని, అటువంటి వారి వివరాలను స్థానిక పోలీసుస్టేషన్‌లో తెలియజేయాలని చెప్పారు.

క్యాన్సర్ రహిత తెనాలి లక్ష్యం

వైద్యశిబిరంలో చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్


వైద్యశిబిరంలో ఖలేదా నసీమ్, డాక్టర్ శారద, కౌన్సిలర్లు

తెనాలి: మహిళల్లో క్యాన్సర్ రహిత తెనాలి.. కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక 25వ వార్డు పినపాడులోని కమ్యూనిటీ హాలులో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రోత్సాహంతో, మున్సిపాలిటీ సహకారంతో పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో కొన్ని నెలలుగా ఈ వైద్య శిబిరాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో 21, 22, 23, 24, 25, 26 వార్డుల పరిధిలోని మహిళలకు ఏర్పాటైన వైద్యశిబిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వార్డు కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య, ఇస్మాయిల్, వెంకటేశ్వరరావు, ఇతర కౌన్సిలర్లు పాల్గొన్నారు. డాక్టర్ శారద ఆధ్వర్యంలో మహిళలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను ముందుగానే కనుగొనే పాప్‌స్మియర్ పరీక్ష, రొమ్ము పరీక్షలు చేశారు. షుగరు, బీపీ, హెమోగ్లోబిన్ శాతం పరీక్షలు నిర్వహించారు. అదే సందర్భంగా డాక్టర్ శారద మహిళలకు క్యాన్సర్ నిరోధానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఎలాంటి ఆహారాన్ని స్వీకరించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మహిళల్లో క్యాన్సర్ రహిత తెనాలి లక్ష్యాన్ని చేరుకునేలా కృషి జరుగుతోందని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ చెప్పారు. ఇందుకోసం డాక్టర్ శారద, ఆమె బృందం చేస్తున్న కృషి నిరుపమానం అన్నారు.

ఇన్‌చార్జి ఏపీపీగా మోహన్‌రెడ్డి

తెనాలి రూరల్: తెనాలిలో నూతనంగా ఏర్పాటు చేసిన పోక్సో కోర్టు ఇన్‌చార్జి అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది దాట్ల మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ ఉత్తర్వులు మంగళవారం జారీచేశారు. మోహన్‌రెడ్డి ప్రస్తుతం 11వ అదనపు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మోహన్‌రెడ్డి నియామకంపై బార్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఆశ్రమ నిర్మాణానికి రూ.50వేల విరాళం

తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మ సేవా శాంతి ఆశ్రమ నిర్మాణానికి విశ్రాంత రైల్వే ఉద్యోగి వాడపల్లి రామకోటేశ్వరరావు రూ.50 వేల నగదును విరాళంగా అందజేశారు. మంగళవారం ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారికి నగదును రామకోటేశ్వరరావు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు ఆశ్రమంలో అందిస్తున్న సేవలు సంతోషదాయకమన్నారు. తొలుతగా ఆశ్రమంలో ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పేదలకు నిత్యావసర కిట్లు పంపిణీ


కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి నాగార్జున, నిర్వాహకులు


మంత్రి నాగార్జున చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న నివాసితులు

పెదపులివర్రు(భట్టిప్రోలు): రావల జార్జ్ ఫౌండేషన్ సేవలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అభినందించారు. పెదపులివర్రులో ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూరల్ హెల్త్ ఎడ్యుకేషన్ అగ్రికల్చర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ (రీడ్స్ సంస్థ, చిత్తూరు) సౌజన్యంతో రూ.80 వేలు వ్యయం చేసే నిత్యావసర కిట్లను 56 మందికి మంత్రి నాగార్జున చేతుల మీదుగా సోమవారం రాత్రి నిర్వాహకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ.. మానవ సేవే మాధవ సేవగా భావించి ఫౌండేషన్ సభ్యులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా భూపతి బ్రదర్స్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మంత్రి నాగార్జున ఫొటోలతో కూడిన మెమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, రీడ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ రావల ఆనంద్, నిర్వాహకులు దీప్తి, భార్గవ్, రావల నిర్మాలాదేవి, పులివర్తి సుశీల, పులివర్తి శశికాంత్, పులివర్తి కరుణశ్రీ, స్థానిక నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు, నీలా రమేష్, కత్తుల సందీప్, భూపతి నాగరాజు, మందపాటి బాబురావు, బేతాళ సురేష్, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావు, ఉన్నవ చంద్రశేఖరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గోవర్ధనగిరి చినబుజ్జి, ఎంపీటీసీ సభ్యులు నన్నెపాముల చంటి, దారావత్ కుమారి బాయ్, వెల్లటూరు సర్పంచ్ చౌటూరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అండగా నిలిచిన మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

జంపని: జంపని గ్రామంలో కుమ్మరి కుంటపై 25 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ క్రమంలో ఇళ్లు తొలగించేందుకు పంచాయతీ కార్యదర్శి వారికి నోటీసులిచ్చారు. బాధితులు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. అన్ని వర్గాల వారు ఏళ్లుగా అక్కడ నివాసాలు ఏర్పరుచుకుని ఉంటున్నారని వివరించారు. ఇళ్లు తొలగించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి మేరుగ నాగార్జున పంచాయతీ కార్యదర్శి వివేక్‌కు ఇళ్లు తొలగించవద్దని ఆదేశాలు జారీచేశారు. మంత్రి ఆదేశాలతో సంతోషం వ్యక్తం చేసిన నివాసితులు మంగళవారం మంత్రి నాగార్జున చిత్రాపటానికి క్షీరాభిషేకం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మంత్రి మేరుగ నాగార్జున బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. కోటయ్య, మిక్కిలి చెన్నయ్య, సాంబయ్య, ముద్రబోయిన రమణమ్మ, మురళీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రూ.5,19,500ల ఉపకార వేతనాలు


ఉపకార వేతనాలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

పిట్టలవానిపాలెం: ఖాజీపాలెంలోని డిగ్రీ, డాక్టర్ డీఎస్ రాజు జూనియర్ కళాశాలల్లోని ప్రతిభగల పేద విద్యార్థులకు దక్కన్ ఫైన్ కెమికల్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.రాజు రూ.5,19,500ల ఉపకార వేతనాలు అందజేశారు. మొత్తం 62 డిగ్రీ, ఇద్దరు ఇంటర్మీడియట్, 30 పీజీ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.శివప్రసాద్ తెలిపారు. మంగళవారం జరిగిన పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆచార్య సత్యనారాయణరాజు పాల్గొన్నారు. కళాశాల పాలక మండలి అధ్యక్షుడు డాక్టర్ మంతెన నరసరాజు, ఉపాధ్యక్షుడు ఎం.శివరామరాజు, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మంతెన శ్రీనివాసకుమార్, జాయింట్ సెక్రెటరీ మంతెన కృష్ణంరాజు, బాపట్ల మాజీ ఎమ్మెల్యే మంతెన అనంతవర్మరాజు, భేతాళం సుబ్బరాజు, ఎం.రామరాజు, శాస్త్రి, పీవీ పాలెం ఆంధ్రబ్యాంకు మేనేజర్ వెంకటరావు తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ


క్రీడాకారులతో తైక్వాండో జిల్లా అసోసియేషన్ సెక్రటరీ జగన్‌మోహన్‌రావు

రేపల్లె: విశాఖపట్నం యలమంచలిలోని వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 10 నుంచి నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనపరిచినట్లు గుంటూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ కె.జగన్‌మోహనరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ప్రతిభ కనపరిచిన క్రీడాకారుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. పోటీలలో జిల్లాకు చెందిన క్రీడాకారులు ఆరు పతాకాలు సాధించారని సెక్రటరీ తెలిపారు. కేజేవీ అరుణ(గుంటూరు) బంగారం, ఎస్‌కే షాహీనా(రేపల్లె) వెండి, ఆర్.లావణ్య(తెనాలి), ఎ.రీమాప్రశిల్లా(రేపల్లె), ఆర్.భువన్‌కుమార్(రేపల్లె), పి.ప్రణవ్ సాయిరాఘవ(రేపల్లె)లు కాంస్య పతాకాలను సాధించారన్నారు. క్రీడాకారుల అభ్యున్నతికి కృషి చేసిన కోచ్‌లు సిహెచ్ రంగ, కె.అనూష, కె.హనుమాన్‌ను ఆయన అభినందించారు. ప్రతిభ కనపరిచిన క్రీడాకారులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.

ఆటోను ఢీకొన్న బస్సు

ఐదుగురికి గాయాలు


గాయపడిన వెంకటేశ్వరమ్మ


ఘటనా స్థలంలో దెబ్బతిన్న ఆటో..

రేపల్లె రూరల్: ఆటోని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఐదుగురు గాయపడిన ఘటన కారుమూరు గ్రామ సమీపంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ అబ్దుల్ రజాక్ వివరాల మేరకు.. రేపల్లె నుంచి తెనాలి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు.. పల్లెకూన నుంచి రేపల్లె వైపునకు కూలీలతో వస్తున్న ఆటోను కారుమూరు సమీపంలో ఢీకొంది. ఈ ప్రమాదంలో పల్లెకూనకు చెందిన ఆటో డ్రైవర్ కె.సుందరయ్యతో పాటు అదే గ్రామానికి చెందిన మురాల సరస్వతి, పరిశా వెంకటేశ్వరమ్మ, పరిశా కుమారి, రెడ్డంకమ్మలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించగా.. క్షతగాత్రులను రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు, ఇరువురిని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిశా కుమారిని, మురాల సరస్వతిని మెరుగైన చికిత్స కోసం గుంటూరు వైద్యశాలకు తరలించారు. పరిశా వెంకటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి

తెనాలిఅర్బన్: కొల్లిపరలో ఈ నెల 19న జరిగే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ సభను వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక వ్యవస్థాపకుడు అక్కిదాసు కిరణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు యాతాటి అనిల్, షేక్ దుబాయ్‌బాబు కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వెల్ఫేర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం సాయంత్రం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాంస్య విగ్రహావిష్కరణకు సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. ఐక్యవేదిక పట్టణ, మండల అధ్యక్షుడు జూపూడి వంశీ, కుర్రా యశ్వంత్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకులు కొడాలి క్రాంతి, మైలా హరి, కోలా వాసు, మల్లిబోయిన రాము, కుర్రా శ్రీను, కౌన్సిలర్ మొగల్ అహ్మద్ బేగ్, ఈద్గా ప్రెసిడెంట్ గౌస్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ రఫీ తదితరులు పాల్గొన్నారు.